శ్రీ భగవద్గీతా జ్ఞానామృత సారము "పాట"

శ్రీరస్తు

శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్,

41-1/8-13A., గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.

https://madhirafamily.wordpress.com/

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

Kiron Type Institute

శ్రీ భగవద్గీతా జ్ఞానామృత సారము 'పాట'

01. శ్రీ కృష్ణ భగవానుడూ, భువిలోన దేవకీ నందనుండై।
భవ బంధములు బాపగా, పార్థునికి గీత సారము దెలిపెనూ॥

02. ధర్మక్షేత్రమునందున పార్థుండు, యిరు సైన్యముల జూచియూ।
తాత తండ్రులు గురువులు, మరియన్న దమ్ములను జూచితాను॥

03. రాజ్య సుఖములకోసమై, స్వజనులను చంపనని పార్థుడపుడు।
గాండీవమును విడిచియు, చింతతో సమరంబు చేయననెను॥

04. కులము నాశము చేతను, కులధర్మములు కూలి పోవుననెను।
ఇట్టి పాపము వల్లను ప్రాప్తమౌ, నరకంబు నిజము నిజము॥

05. దిక్కుతోచక నున్నదీ, శ్రీ కృష్ణ దారి జూపుము గురుడవై।
దీన బాంధవ బ్రోవుమా, శరణంబు వేడి నీ శిష్యుడైతీ॥

06. మోహమందున జిక్కియు, అర్జునుడు శోకమొందగ గాంచియు।
చిరునగవుతో కృష్ణుడు, పార్థునికి గీత దెలుపగ బూనెనూ॥

07. చావు పుట్టుక లందున, విజ్ఞుండు శోకమొందడు యెప్పుడూ।
ప్రజ్ఞ వాదములాడెటి, ఫల్గుణా శోకించ తగదు నీకు॥

08. బాల్య యవ్వనవృద్ధము, కౌమార మరణములు దేహమునకే।
జనన మరణము లేనిది, ఈ ఆత్మ సత్యమని దెలిపె స్వామి॥

09. అస్త్ర శస్త్రము చేతను, మరి పంచ భూతముల చేత ఆత్మ।
బాధింపబడదు పార్థా, అచలమై అంతటా వెలుగు చుండూ॥

10. అన్ని ధర్మములకన్న, క్షాత్రునికి వీరత్వమే శ్రేయము।
విజయమందిన సౌఖ్యము, లేకున్న వీరస్వర్గము ఖాయమూ॥

11. కర్మ జేయుట యందునే, జీవునకు అధికారముంది గాని।
ఫలితమాశించబోకు, దానిపై హక్కేమి లేదు నీకూ॥

12. భ్రష్టత్వ మొచ్చునయ్యా, యిలలోన కర్మ జేయక యున్ననూ।
నిష్కామ కర్మ వలన, అర్జునా పుణ్యపాపము లంటవూ॥

13. దేవాది దేవ కృష్ణా, యిలలోన స్థితప్రజ్ఞుడెట్లుండెను?
పార్థుడడిగిన ప్రశ్నకూ, పరమాత్మ ఈ రీతిగాను దెలిపే॥

14. కామ క్రోధ భయమును, అనురాగమును విడిచి యుండునెపుడూ।
సుఖ దుఃఖముల యందునా, సమబుద్ధి కలిగి వర్తించునతడూ॥

15. కూర్మంబు వలె నుండునూ, ఇంద్రియ విషయాల యందు పోక।
పరమాత్మ దర్శనంబే, ముఖ్యమని తలపోయుచుండునెపుడు॥

16.జ్ఞాన కర్మముల యందు, మనుజునకు శ్రేయంబు ఏదియనగా।
కర్మయోగము యోగికి, జ్ఞానంబు సాంఖ్యులకు శ్రేష్టమనిరి॥

17. సర్వ జీవులు ఎప్పుడూ, యిలలోన కర్మ జేయక తప్పదు।
మమత నహమును వీడియు, నిష్కామ కర్మ జేయుము చాలునూ॥

18. కామమే జీవులాకు, పాపంబు జేయుటకు కారణంబూ।
ఆత్మ జ్ఞానము నెరిగియు, బుద్ధిచే కామంబు నరికట్టుమూ॥

19. ధూమంబుచే వహ్నియు, మురికిచే అద్దంబు కప్పబడునూ।
మావిచే గర్భశిశువు, అటులనే కామంబుచే ఆత్మయూ॥

20. బహు సనాతనంబు, ఈ విద్య సత్యమని నమ్ము పార్థా।
భక్త సఖుడావగుటచే, ఈ విద్య దెల్పితిని నీకు నేను॥

21. జన్మంబు లేదు నాకు, యిలలోన నాశమే ఎరుగనయ్యా।
అవసరంబైన వేళ, మాయచే అవతరింతును అప్పుడూ॥

22. దుష్ట శిక్షణ కోసమై, ధరలోన ధర్మమును స్థాపించగా।
యుగ యుగము నందు నేను, సంభవం బొందెనను వినుము పార్థా॥

23. దివ్యమైనటు వంటివీ, నా జన్మ కర్మములు దెలుసుకుంటే।
మరణంబు పొందినాకా, భువిలోన మరుజన్మ పొందకుండూ॥

24. గహనమైనటు వంటిదీ, ఈ కర్మ ఘనులకైననూ తెలియదూ।
వినుము పార్థాయనుచును, పరమాత్మ సర్వ కర్మలు దెలిపెనూ॥

25. దైవమును చేరుటాకు, చేసేటి ప్రయత్నమే యజ్ఞమనియు।
యజ్ఞములయన్నింటిలో, జ్ఞానమే శ్రేష్టమని దెలిపె స్వామి॥

26. సాష్టాంగ వందనంబు, శుశ్రూష పరి ప్రశ్న చేయగానే।
సంతసముతో సద్గురుండు, తక్షణమె తత్వంబు దెలుపు నీకు॥

27. జ్ఞానంబు కన్న మిన్న, పవిత్రం బైన దేమియు లేదనె।
అట్టి జ్ఞానము నొందగ, శ్రద్ధతో సాధనలు చేయుమనెను॥

28. కర్మ త్యాగము కన్ననూ, కర్మ ఫల త్యాగమే శ్రేయమనెను।
నిష్కామ బుద్ధి గలిగి, యిలలోన కర్మ జేయుము యెప్పుడూ॥

29. ఈశ్వరార్పణ బుద్ధితో, కర్మములు జేసేటి ధీరులంతా।
పద్మ పత్రము మాదిరి, పాపమును ధరలోన అంటకుండూ॥

30. పుణ్య పాపంబులాకు, బాధ్యుడను తాను కాదని దెల్పియు।
జ్ఞానంబు నజ్ఞానమే, కప్పెనని పార్ధునికి దెలిపె స్వామి॥

31. ఈ లోకమున ఎవ్వరూ, ఫల్గుణా నిను ఉద్ధరించరయ్యా।
నీవు చేసెటి సాధనే, నిను ఉద్ధరించునని దెలిపె స్వామి॥

32. శుచియైన స్థలము నందు, స్థిరమైన దర్భాసనంబు వేసి।
శిరము కాయము సమముగా, నెలకొల్పి ధ్యానంబు జేయవలెనూ॥

33. నాసికాగ్రము నందున, దృష్టిని ఏకాగ్రమొనరించియు।
పరమగతిగా నెంచియు, నా యందు చిత్తమును నిల్పుమనెను॥

34. చంచలంబగు మనసును, గాలివలె నిల్పుటా యతి కష్టము।
నిగ్రహింపుట దుష్కరం, హే కృష్ణ మాధవా దారి జూపు॥

35. సంశయము లేదు పార్థా, దానిని నిగ్రహించుట కష్ట సాధ్యం।
అభ్యాస వైరాగ్యములచే, చిత్తమును నిల్పుటా సులభమనెను॥

36. యోగ భ్రష్టుడు చివరకు, మరణంబు నొందినను బాధలేదు।
పుణ్యలోకములెల్ల తిరిగీ, శుచియైన శ్రీమంతు లింట బుట్టు॥

37. ఆర్తుడు అర్థార్థియు, జిజ్ఞాసు జ్ఞాని నలుగురు భక్తులూ।
వారిలో జ్ఞాని యేను, శ్రేష్టుడని పరమాత్మ దెల్పినాడూ॥

38. బహు జన్మ పుణ్యమూర్తే, సర్వంబులో నున్న తనను ఎరుగు।
అట్టి వారలు ధరణిలో, అరుదు యని పార్ధునికి దెలిపె స్వామి॥

39. మందబుద్ధులు ఎప్పుడూ, అవ్యక్త రూపంబు నెరుగలేకా।
పాంచ భౌతిక దేహమే, సత్యమని తలచేరు మదిన వారూ॥

40. ఆధ్యాత్మ మధి యజ్ఞము, అధి దైవ మధి భూతమన్ని తానే।
అక్షరంబగు బ్రహ్మము, సర్వంబు తానని దెలిపె శౌరి॥

41. అంత్య కాలం బందు కూడా, తన నామస్మరణ నెవ్వరు జేతురో।
అట్టి వారలు చివరకు, నను జేరి నా రూపమును బొందునూ॥

42. తుది శ్వాస విడుచు వేళ, ప్రణవాక్షరంబు నీ మదిన దలచి।
యోగధారణ జేసియు, ప్రాణమును భ్రుకుటి మధ్యన జేర్చుమూ॥

43. బ్రహ్మరంధ్రము నందున, ప్రాణమును జేర్చిన యోగ పరుడు।
మరల జన్మకు రాడని, శ్రీ కృష్ణ పరమాత్మ దెలిపినాడు॥

44. వేద శాస్త్రాల కన్న, మరి యజ్ఞ దాన తపముల కన్ననూ।
యోగి యైనట్టివాడు, పరమోన్నతిని బొందుననెను స్వామి॥

45. రాజగుహ్యమైనది, ఈ విద్య వుత్తమం బహు పవిత్రం।
అనసూయ వంతుడనియు, దెలిపితిని ఈ బ్రహ్మ విద్య నీకు॥

46. పుణ్య కర్మలు జేసియు, స్వర్గమున సుఖ మొంద దలచి నావా।
పుణ్యంబు క్షీణించగా, భువి జన్మ కలుగునని శౌరి దెలిపే॥

47. అన్య చింతన వీడియు, నిరతము నా స్మరణ చేస్తె చాలు।
భారమంతయు వహించి, నీ యొక్క యోగక్షేమము జూతును॥

48. భక్తితో నొసగునట్టి, ఫల పుష్ప పత్ర తోయము లైనను।
ప్రీతితో స్వీకరింతూ, నని దెల్పె పార్థునకు శ్రీ హరి॥

49.సకల భూతములందున, ఫల్గుణా సమముగా వర్తించెదా।
ద్వేషించు వారెవ్వరూ, అట్లని ప్రేమించు వారెవ్వరూ॥

50. సకల పాపుల కన్ననూ, లోకమున అతిఘోరపాపియైనా।
నన్ను నమ్మియు నిరతము, భజియించ ముక్తి గల్గును వానికి॥

51.నన్ను నమ్మిన భక్తుడు, ఎన్నటికి హీన గతి నొందడనియు।
పరమాత్మ దెలిపినాడు, పార్థునకు ప్రతిజ్ఞ జేయుమనియూ॥

52. సతత మెవ్వరు ప్రీతితో, పరమాత్మ నామంబు కీర్తించునో।
అతి సూక్ష్మమైన తనను, దర్శించు బుద్ధి యోగము నిచ్చునూ॥

53. సర్వ ప్రాణుల యందున, వెలుగొందు ఆత్మతానని దెల్పుచు।
వివరించి తన మహత్తు, పార్థునకు విశద పరచెను అప్పుడూ॥

54. విస్తారమైన యట్టి, విభూతి విషయంబు నెరిగినంత।
పార్థుండు సంతసించి, శ్రీ హరిని పలురీతి ప్రార్థించెనూ॥

55. సృష్టి స్థితి లయ కారణం, సర్వంబు తానని స్పష్టపరచె।
తన యొక్క అంశచేత, ఈ సర్వ మాయెనని శౌరి దెలిపే॥

56. శ్రీ కృష్ణ భగవానుడా, అజ్ఞాన మోహంబు అంతరించే।
నీదు విశ్వ రూపము, దర్శించ అర్హుడైతె జూపుమూ॥

57. చూడ శక్యము గానిది, ఈ నేత్రములకు యా విశ్వరూపం।
దివ్య నేత్రము నిచ్చియు, పార్థునకు విశ్వరూపము జూపెనూ॥

58. తనలోని విశ్వమంతా, పార్థునకు పరమాత్మ జూపినాడు।
సకల జగజనము జూచి, పార్థుండు భీతితో వాపోయెను॥

59. జన్మ ధన్యం బైనది, పరమాత్మ నీ రూపు దిలకించగా।
సౌమ్య రూపము జూపుము, ఇక నేను జూడలేనీ రూపమూ॥

60. ప్రీతితో శ్రీ కృష్ణుడు, ఉప సంహరించె నా రూపమపుడు।
సౌమ్య రూపము తోడుత, కనిపించి పార్థుని కనికరించే॥

61. తన గూర్చి తెలియుటాకు, దర్శించి తనలోన జేరుటాకు।
యజ్ఞ దానము లెందుకు, నిర్మల భక్తి యొక్కటె చాలునూ॥

62. మత్పరమ భక్తుడావై, మత్కర్మ కార్యములు జేసి నీవు।
సర్వమర్పణ జేయుమూ, ఫల్గుణా నన్ను జేరెదవప్పుడూ॥

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

63. నిను సేవించు నట్టి, మార్గాన ఏది శ్రేయమె దెల్పుమూ।
సాకారమున జేయనా, శ్రీ కృష్ణ నిరాకారము జేయనా॥

64.నిరాకారము జేయగా, ఫల్గుణా అతికష్టమౌను నీకు।
సగుణసాకారంబును, సద్బుద్ధితో నీవు గొలువు మనెనూ॥

65. భక్తి యోగము నందున, సల్లక్షణములన్ని కలిగి వుండి।
నన్ను కొలిచెటి భక్తుడు, నాకెంతో యిష్టుడనె మాధవుండూ॥

66. క్షేత్ర మనగా దేహము, ఓ పార్థ దేహియే క్షేత్రజ్ఞుడు।
క్షేత్రమును గుర్తెరిగెటి, తెలివియే దైవమని దెలిపె శౌరి॥

67. క్షేత్ర క్షేత్రజ్ఞులాను, రెండింటి జ్ఞానంబు దెలియమనెను।
నన్ను పొందుట కోసము, సల్పుమనె జ్ఞాన కర్మ ధ్యానమూ॥

68. గుణము లందున జేరియు, సుఖ దుఃఖముల నొందు జన్మనెత్తు।
ప్రకృతే కారణంబు, జీవుడు జన్మాదు లెత్తుటకూ॥

69. ఆత్మ దేహము నందున, సాక్షియై వెలుగొందు నని దెల్పెను।
కర్త కాదని దెల్పెను, ఈ ఆత్మ అవ్యయం బని దెల్పెనూ॥

70. జ్ఞానమును ఆశ్రయించి, నాలోన ఐక్యతను పొందియుంటే।
సృష్టి ప్రళయములందున, జీవుండు జనన మరణము లొందదూ॥

71. మాయచేతను బుట్టిన, ఈ మూడు గుణములే జీవునాకు।
బంధనంబైయున్న వనుచు, పరమాత్మ గుణములను దాటమనెను॥

72. తామసిక గుణము కన్న, ధరలోన రాజసిక గుణమె శ్రేయం।
రాజసిక గుణము కన్న, జీవునకు సత్వమే శ్రేయమనెను॥

73. మోక్షమును పొందుటాకు, త్రిగుణముల వీడవలెననెను స్వామి।
గుణ తీతుడైన వాడు, బ్రహ్మమును పొందునని దెల్పె శౌరీ॥

74. మీద మూలము గలిగియు, వేదాలు ఆకులై అలరుచున్న।
అశ్వత్థమను వృక్షము, నెరిగితే వేదార్ధ మెరిగినట్టే॥

75. ఈ చెట్టు కొమ్మలన్ని, త్రిగుణాలచే వృద్ధి పొందుచుండే।
విషయాలు చిగురులయ్యి, అశ్వత్థమంతటా వ్యాప్తి జెందే॥

76. సంసారమను వృక్షము, పార్ధుడా సామాన్యమని దలచకు।
అసంగమను శస్త్రము, చేబట్టి మూలమును పెకిలించుమూ॥

77. అజ్ఞాన వశము చేత, జీవుడు తన రూపు తెలియకుండే।
సకల దేహములందున, నాయంశ వ్యాపించి యున్నదెరుగూ॥

78. వైశ్వానరాగ్ని గాను, ప్రాణుల దేహమందున యుండియు।
నాల్గు విధ అన్నములను, పచనంబు చేసేది నేనే పార్ధా॥

79. క్షర పురుషుడన దేహము, అక్షరుండన జీవుడని యెరుగుము।
పురుషోత్తముడనేనని, ఫల్గుణా శ్రద్ధతో యెరుగు మనెనూ॥

80. దాన దమ యజ్ఞములను, స్వాధ్యాయ తప అర్జవంబునొందు।
సత్య శుచి దయ గల్గియు, అభయాది దైవ గుణముల నొందుమూ॥

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute

81. నరక ద్వారము జేర్చెటి, కామాది అసురగుణముల వీడుము।
దైవ సంపద పొందితే, శీఘ్రమే దైవత్వ సిద్ధి కలుగు॥

82. శాస్త్రమే ప్రామాణము, పార్థుడా! కార్య కార్యములందున।
శాస్త్ర విధి వీడినావా, హీనగతి గల్గునని దెలిపె శౌరీ॥

83. త్రివిధ మైనటువంటివి, ఆహార యజ్ఞ తప దానములను।
త్రివిధ శ్రద్ధలు గూర్చియు, పరమాత్మ పార్థునకు తెలియపరచే॥

84. గత జన్మ వాసనలచే, ఫల్గుణా జీవులకు శ్రద్ధ గలుగు।
శ్రద్ధ బేధంబులన్ని, యిలలోన గుణ త్రయము చేత గలుగూ॥

85. శ్రద్ధ లేనట్టి కర్మ, సత్కర్మ కాదని పార్థునకు దెలిపే।
యిహ పరముల యందున, అశ్రద్ధ కొరగాదని దెలిపె శౌరీ॥

86. ఓం తత్సదితి యనియును, బ్రహ్మమును పూర్వులు కొనియాడిరీ।
వేద యజ్ఞము లన్నియు, ప్రణవంబు నుండి వుద్భవమొందెనూ॥

87. త్యాగమును గూర్చి శౌరి, పార్థునకు దెలిపె ఈ విధము గానూ।
కర్మఫల త్యాగంబుతో, యిల కర్మ బంధములు అంటవనెనూ॥

88. చిత్త శుద్ధికి మూలము, యజ్ఞ తప దాన కర్మము లన్నియు।
శ్రద్ధతో వినుము పార్థా, సత్కర్మ నీవు విడువకు ఎప్పుడూ॥

89. సాధనకు ఈ మార్గము, బహు సులభమనె దెలిపె పార్థునకును।
స్వకర్మణములచేతే, అర్చించి పొందవచ్చునె సిద్ధినీ॥

Kiron Type Institute

90. ముక్తి పొందుట కోసము, మూలంబు జ్ఞానమని దెలిపె స్వామి।
భక్తి చేతనె జ్ఞానము, కలుగునని చక్కగా దెలిపె శౌరీ॥

91. దేహ యంత్రములన్నియు, పార్థుడా కీలు బొమ్మల వంటివీ।
హృదయ మధ్యము నందున, నేనుండి మాయచే ద్రిప్పుచుంటీ॥

92. ఇష్టుడ వైనందున, నీహితము గోరి నే చెప్పుచుంటీ।
ముక్తి కలుగును యిప్పుడే, భక్తితో మనసుంచి నను వేడితే॥

93. సర్వ ధర్మము లన్నియు, విడనాడి నా శరణు వేడుచుండు।
పాపముల నుండి నిన్ను, విడిపించి ముక్తి నిచ్చెదనన్నడూ॥

94. గీత ధర్మములన్నియు, లోకమున వెదజల్లు వారికంటే।
నాకు యిష్టులు లేరయా, వారంటే నాకెంతో ప్రీతి పాత్రం॥

95. ఔషధ సేవనముచే, వ్యాధులు దూరమైనట్లుగాను।
భవరోగమను వ్యాధికి, గీతయే దివ్యౌషధం బంటిరీ॥

96. పరమాత్మ బోధ వినియు, పార్థుండు భక్తితో యిట్టులనియే।
నాలోని అజ్ఞానము, మోహంబు తొలగెనని పార్థుడనియే॥

97. శ్రీ కృష్ణ పరమాత్మయు, పార్థుండు ఎక్కడెక్కడ యుండునో।
సర్వ సంపద విజయము, అచ్చట దృఢమైన నీతుండునూ॥

98. శ్రద్ధతో ఈ గీతము, పఠియించ సకల శుభములు కలుగును।
యిహమందు సకల సుఖము, పరమందు మోక్షంబు కలుగు నిజమూ॥

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

99. ధరణి వైరాపురమున, సద్బోధ దెల్పేటి సద్గురుండు।
శ్రీ సత్యయాఖ్య ప్రభువు, ఈ బోధ తెలియపరచెను శ్రద్ధగా॥

100. శ్రీ సత్యయాఖ్యగురుని, సేవించి కృష్ణుండు దెల్పినట్టి।
గీత గానము చేసిన, వారెల్ల పరమ పదమును జేరునూ॥

॥ సర్వం సద్గురు చరణార విన్దార్పణ మస్తు ॥

- - - కృష్ణం వందే జగద్గురుమ్ - - -

---===---





(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. – 994 994 1430 OR 944 044 9650)